నీటి సమస్యను అధిగమించేలా..

- గ్రామాల్లో చేతిపంపులకు మరమ్మతులు చేయిస్తున్న అధికారులు
- వేసవిలో తాగునీటి కొరత నివారణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు



సింగారెడ్డిపాలెంలో చేతిపంపునకు మరమ్మతు చేస్తున్న సిబ్బంది



చెట్లముకుందాపురంలో..

పెన్‌పహాడ్‌ : ఏళ్ల క్రితం తాగునీటి అవసరాలు తీర్చిన చేతిపంపులు ఆ తర్వాత మూలనపడ్డాయి. మిషన్‌ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు సరఫరా చేయడంతోపాటు చాలా మంది ఇళ్లలో బోర్లు వేయించుకోవడంతో వీధుల్లో ఉన్న హ్యాండ్‌ బోర్లను పట్టించుకునే వారు కరువయ్యారు. కానీ ఈ ఏడాది భూగర్భజలాలు అడుగంటడంతో మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో నీటి సరఫరాలో ఇక్కట్లు ఎదురయ్యాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు హ్యాండ్‌బోర్లపై దృష్టి సారించారు. మండల వ్యాప్తంగా ఉన్న బోర్లను గుర్తించి యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయించారు.

340కు పైగా బోర్లు సిద్ధం..

పెన్‌పహాడ్‌ మండల వ్యాప్తంగా 340కు పైగా చేతిపంపులు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇందులో 60 చేతి పంపులు చెడిపోగా అందులో 46చేతి పంపులను మరమ్మతులు చేశారు. కొన్ని చేతిపంపులు రోడ్ల నిర్మాణం సందర్భంగా భూమిలో కూరుకుపోగా, మరికొన్ని మరమ్మతు చేసినా పనిచేసే పరిస్థితి లేదని గుర్తించారు. మిగతా చేతిపంపులకు మరమ్మతులు చేయించారు. ఇవేకాక తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నచోట రైతుల నుంచి బోర్లు అద్దెకు తీసుకున్నారు. మిషన్‌ భగీరథ పథకం ప్రారంభమయ్యాక ఆర్‌డబ్ల్యూఎస్‌ ద్వారా చేతి పంపుల ఏర్పాటు ప్రక్రియను నిలిపివేయగా.. ఇప్పుడు అవసరమైన చోట బోర్లు వేయిస్తున్నారు. మే నెలలో ఎండలు పెరిగి పరిస్థితులు ఇబ్బందికరంగా మారితే ప్రస్తుతం మరమ్మతు చేయించిన హ్యాండ్‌బోర్ల ద్వారా ప్రజలకు ఉపశమనం లభించనుంది.

చేతి పంపుల మరమ్మతుకు చర్యలు చేపట్టాం



మండల వ్యాప్తంగా ఉన్న చేతి పంపులకు అవసరమైన మరమ్మతులు చేయించాం. ఇప్పటివరకైతే ఎక్కడ కూడా తీవ్రమైన నీటి ఎద్దడి ఉన్నట్లు మా దృష్టికి రాలేదు. నిత్యం గ్రామాల్లో పరిశీలిస్తూ తాగునీటి సరఫరాలో ఇక్కట్లు ఎదురవకుండా చూస్తున్నాం.

– శ్రీనివాస్‌, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఏఈ

మురికి కల్వర్టును మూసివేయాలి



కొత్త బస్టాండ్‌ సమీపంలోని మురికి కల్వర్టు వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

దురాజ్‌పల్లి : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌ వద్ద ఉన్న మురికి కాలువను వెంటనే మూసివేయాలని సీపీఐ(ఎంఎల్‌) మాస్‌ లైన్‌ నాయకులు అన్నారు. సోమవారం వారు మురుగు కాలువను పరిశీలించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్‌ మాట్లాడారు. ప్రమాదకరంగా ఉన్న ఈ కాలువ వద్ద ఎప్పుడూ జనసంచారం, వాహనాలతో రద్దీగా ఉండటం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డు వెడల్పు చేసినప్పుడు కూడా ఈ కాలువని మూయకుండా ఉంచారని తెలిపారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు నిర్లక్ష్యం వీడి మురికి కాలువ పనులు పూర్తి చేసి ప్రజలకు, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్‌ కుమార్‌, పేరబోయిన రమేష్‌, సయ్యద్‌, వాజిద్‌ తదితరులు పాల్గొన్నారు.

18న బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి మల్లేష్‌ ప్రచారం



మాట్లాడుతున్న సోమేష్‌గౌడ్‌

అర్వపల్లి : భువనగిరి పార్లమెంట్‌ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి క్యామ మల్లేష్‌ ఎన్నికల ప్రచారం ఈ నెల 18న అర్వపల్లి నుంచి ప్రారంభమవుతుందని బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్‌ చెప్పారు. రామన్నగూడెంలోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో సోమవారం జరిగిన బీఆర్‌ఎస్‌ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 18న అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఎంపీ అభ్యర్థి మల్లేష్‌ గెలుపు కోసం మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌, బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు లింగయ్యయాదవ్‌, జెడ్పీ చైర్‌పర్సన్‌ గుజ్జ దీపికయుగంధర్‌రావు పూజలు జరిపి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. బీఆర్‌ఎస్‌ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకుడు బొడ్డు రామలింగయ్యయాదవ్‌, ఎంపీటీసీ బిక్కునాయక్‌, చిర్రబోయిన వెంకన్న, గోనుల విజయ్‌, దుబ్బాక ఎల్లంరాజు, జేడి ఉపేందర్‌, పున్న హరిప్రసాద్‌, ఎద్ల సైదులు, బంటు యాదగిరి, రవీందర్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సూర్యాపేట : అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని లీడింగ్‌ ఫైర్‌ ఆఫీసర్‌ శంకర్‌ నాయక్‌ అన్నారు. సోమవారం అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని సీఎంఆర్‌ షాపింగ్‌ మాల్‌లో సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. షాపింగ్‌ మాల్‌, హాస్పిటల్స్‌ నిర్వాహకులు తప్పని సరిగా అగ్నిమాపక యంత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వంట చేసే సమయంలో గ్యాస్‌ సిలిండర్‌ లీకేజీ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైర్‌ సిబ్బంది ప్రవీణ్‌కుమార్‌, వెంకన్న, సత్యనారాయణ, యాకూబ్‌, సీఎంఆర్‌ మేనేజర్‌ సురేష్‌, సాంబారి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

మోతె : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆర్డీఓ వేణుమాధవరావు అన్నారు. మోతె మండల కేంద్రంలో మహిళా సంఘం, సిరికొండ పీఏసీఎస్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసి కాంటాలు వేయించాలని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీటి వసతి, టెంట్‌ సౌకర్యం కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. 17 శాతం మ్యాచర్‌ ఉన్న ధాన్యానికి గ్రేడ్‌ఏ ధర వస్తుందన్నారు. మండలంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని సంబంధిత మండల స్థాయి అధికారులను ఆదేశించారు. నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్‌ సంఘమిత్ర, ఆర్‌ఐ మన్సూర్‌అలీ, వ్యవసాయధికారిని అరుణ, ఏఈఓ మానిక, ఏపీఎం వెంకయ్య, సీసీలు, ఐకేపీ కేంద్రాల నిర్వాహకులు ఉన్నారు.

కోమటిరెడ్డి సహకారం అభినందనీయం



కోమటిరెడ్డి సహకారంతో నిర్మించిన భవనం

నూతనకల్‌ : విశ్రాంత ఉద్యోగుల భవన నిర్మాణం కోసం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అందించిన సహాయ సహకారాలు అభినందనీయమని తుంగతుర్తి మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ తీగల గిరిధర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగులు మండల కేంద్రంలో భవన నిర్మాణం కోసం మంత్రి కోమటిరెడ్డిని కోరగా స్పందించిన మంత్రి తన వ్యక్తిగత నిధుల ద్వారా రూ. 2.50లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు ఏలేటి నారాయణరెడ్డి, బందు కృష్ణయ్య, జి. హన్మంతరావు, బొడ్డుపల్లి అంజయ్య, సాబాది వాసు, బండపల్లి చంద్రు, అలగడప సత్యనారాయణ, ఎండీ జాన్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎండలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన



వెంపటి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

తుంగతుర్తి : ఎండాకాలంలో వడదెబ్బకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలు, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఆరోగ్య విస్తరణాధికారి సముద్రాల సురేందర్‌ అన్నారు. సోమవారం మండల పరిధిలోని వెంపటి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వడదెబ్బపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఎండాకాలంలో అధిక సమయంలో ఎండలో తిరుగడం వల్ల వడదెబ్బకు గురవుతారని అన్నారు. వడదెబ్బకు గురైనట్లయితే తీవ్ర జ్వరం, తలనొప్పి, తల తిరగడం, వాంతులు, విరేచనాలు లాంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. వడదెబ్బ బారిన పడకుండా ఉండడానికి ప్రజలందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వెంకట్రామనర్సమ్మ, హెల్త్‌ అసిస్టెంట్లు గాజుల సోమయ్య, లకావత్‌ యాదగిరి, ఉపాధ్యాయులు ఎల్లయ్య, శ్రీనివాస్‌, రవీందర్‌, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర స్పీడ్‌ బ్రేకర్లను తొలగించాలని వినతి



జాజిరెడ్డిగూడెంలో కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న గౌడ్స్‌కాలనీ వాసులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని గౌడ్స్‌కాలనీలో ప్రమాదకరంగా ఉన్న స్పీడ్‌ బ్రేకర్లను తొలగించాలని కోరుతూ గౌడ్స్‌కాలనీ వాసులు సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి నెహ్రూనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎత్తుగా, ప్రమాదకరంగా ఉన్న స్పీడ్‌ బ్రేకర్లతో వాహనాలు వెళ్లడానికి, రాకపోకలకు ఇబ్బంది అవుతుందని చెప్పారు. వెంటనే వీటిని తొలగించాలని, సాధారణంగా ఉండేలా స్పీడ్‌ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నర్సింగ శ్రీనివాస్‌గౌడ్‌, తాటిపాముల జలంధర్‌, శంకరయ్య, కె. యాదయ్య, కె. చంద్రశేఖర్‌, కుంభం యాగయ్య, కె.రాంబాబు, దేవరకొండ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరం

అర్వపల్లి : మండల పరిధిలోని జాజిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ ఆవాసం తుంగగూడెంలో సోమవారం ఉచిత పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 176 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. రైతులు తప్పనిసరిగా తమ పశువులకు టీకాలను వేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్‌ బి. అర్జున్‌, వీఎల్‌ఓ కేఎస్‌ఎస్‌.పద్మ, సిబ్బంది యాకయ్య, యాదగిరి, రైతులు తుంగ వెంకటేశ్వర్లు, మద్ది శ్రీను, కమటం రవి, దడిగ మల్లేష్‌, నర్సింగ సోమయ్య, సైదుల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌, సీపీఎంల మధ్యే ప్రధాన పోటీ



తుంగతుర్తిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు



అర్వపల్లి : తిమ్మాపురంలో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్న యాకలక్ష్మి

తుంగతుర్తి : లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌, సీపీఎంల మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సీపీఎం లోక్‌సభ అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్‌ గత పది సంవత్సరాల పాలనలో పూర్తిగా అవినీతి ఊబిలో కూరుకుపోయిందని తెలిపారు. ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న, 30 సంవత్సరాలుగా పోరాడుతున్న సీపీఎం అభ్యర్థిని గెలిపిస్తే పార్లమెంటులో ప్రజా గొంతుక అవుతారని అన్నారు. ఈ ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, కోట గోపి, మట్టిపెల్లి సైదులు, చెరుకు ఏకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాస్‌, కందాల శంకర్‌ రెడ్డి, పులుసు సత్యం, కార్యదర్శి వజ్జే శ్రీనివాస్‌, నాయకులు ముత్తయ్య, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

అర్వపల్లి : ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతరం పోరాటం చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు చెరుకు యాకలక్ష్మి అన్నారు. భువనగిరి పార్లమెంట్‌ సీపీఎం అభ్యర్థి ఎండీ. జహంగీర్‌ గెలుపుకోసం తిమ్మాపురంలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సీపీఎంను గెలిపిస్తే ప్రజా సమస్యలపై మరింత పోరాటం చేయవచ్చని చెప్పారు. బీజేపీ పదేళ్ల పాలనలో పేదలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. ఈ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు పేరబోయిన రవి, సీఐటీయూ మండల కార్యదర్శి ఎల్లంల అవిలయ్య, మద్ది రాజయ్య, సైదులు, జాల మల్లయ్య, కొండలు, రాములు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

తిరుమలగిరి : పేదలు, కార్మికుల హక్కుల కోసం పోరాడే సీపీఎం భువనగిరి పార్లమెంట్‌ అభ్యర్థి ఎండీ.జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు కోరారు. సోమవారం తిరుమలగిరి పట్టణంలోని ఐకేపీ కేంద్రంలో రైతులను, కూలీలను కలిసి కరపత్రాలను పంచి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాని వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు సత్యం, మండల కన్వీనర్‌ జి.ఉప్పలయ్య, దేవరకొండ యాదగిరి, ఎం.లక్ష్మి, వనం సోమయ్య, యాకయ్య, యాదయ్య పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలి

నాగారం : భువనగిరి పార్లమెంట్‌ సీపీఎం అభ్యర్థి మహ్మద్‌ జహంగీర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలోని కోట్లాది మంది కోసం ఉపాధి హామీ చట్టాన్ని అమల్లోకి తెచ్చిన ఘనత సీపీఎందే అన్నారు. నాడు పార్లమెంట్‌లో సీపీఎంకు 64 మంది ఉండడం వల్ల ప్రభుత్వానికి బయట నుంచి మద్దతు ఇచ్చి ఉపాధి హామీ చట్టాన్ని అమల్లోకి తెచ్చామన్నారు. పార్లమెంట్‌లో సీపీఎం సభ్యులు ఉంటే దేశ ప్రజలకు రక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మట్టిపల్లి సైదులు, పులుసు సత్యం, దేవరకొండ యాదగిరి, మల్లయ్య, మంగమ్మ, జ్యోతి, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



తిరుమలగిరిలో ప్రచారం చేస్తున్న నాయకులు



నాగారంలో..

కూలీలకు ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్ల పంపిణీ



కొమ్మాలలో ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న సీహెచ్‌ఓ చరణ్‌, వైద్యసిబ్బంది

అర్వపల్లి : ప్రజలు, కూలీలు వడదెబ్బ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అర్వపల్లి పీహెచ్‌సీ సీహెచ్‌ఓ ఎల్‌. చరణ్‌ సూచించారు. మండల పరిధిలోని కొమ్మాలలో ఉపాధి కూలీలు, హమాలీ కార్మికులకు సోమవారం వడదెబ్బ లక్షణాలు, జాగ్రత్తల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఉపాధి కూలీలు, హమాలీలు ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 గంటల తర్వాత పనికి వెళ్లాలని సూచించారు. ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లను గ్రామాల్లో ఆశా కార్యకర్తలు, పోస్టాఫీస్‌, ఫీల్డ్‌ అసిస్టెంట్‌లు, రేషన్‌డీలర్ల వద్ద అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వర్షిత, పంచాయతీ కార్యదర్శి నారాయణమూర్తి, ఆశా కార్యకర్త జి. కవిత, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి

పెన్‌పహాడ్‌ : మండల పరిధిలోని భక్తాళాపురం గ్రామంలో సోమవారం విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతిచెందాయి. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. భక్తాళాపురం గ్రామానికి చెందిన నాగవెల్లి నీలమ్మకు చెందిన మూడు పాడి గేదెలు మేత కోసం వెళ్లి అప్పటికే తెగిపడిన విద్యుత్‌ ఎల్‌టీ లైన్‌ తీగను తొక్కడంతో అక్కడికక్కడే గేదెలు మృతిచెందాయి. మృతిచెందిన గేదెల విలువ సుమారు రూ.1.60లక్షలు ఉంటుందని బాధితురాలు పేర్కొంది. మండల పశువైద్యాధికారి కిరణ్‌, పంచాయతీ కార్యదర్శి మునీర్‌, విద్యుత్‌ లైన్‌మెన్‌ సుదర్శన్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. బాధిత కుటుంబాన్ని ఎంపీపీ నెమ్మాది భిక్షం, బీఆర్‌ఎస్‌ నాయకులు జట్టుకొండ గణేష్‌, నల్లపు శ్రీరాములు, నీలాల సతీష్‌ పరామర్శించారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న అధికారి

అర్వపల్లి : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కొమ్మాల గ్రామ ప్రత్యేక అధికారి ఎల్‌.చరణ్‌ కోరారు. సోమవారం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి 17 శాతంలోపు తేమ ఉండేలా కేంద్రానికి తేవాలన్నారు. ధాన్యం నిబంధనల ప్రకారం ఉంటేనే మద్దతు ధర వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.నారాయణమూర్తి, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

కోదాడ : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు జానిమియా అన్నారు. సోమవారం కోదాడ టీఎన్‌జీఓ యూనిట్‌ ఆధ్వర్యంలో టీఎన్‌జీఓ భవన్‌ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి దున్నా శ్యామ్‌, కోదాడ అధ్యక్ష, కార్యదర్శులు చిరంజీవి, పద్మ, పోటు వెంకటేశ్వరరావు, అనంతరావు, శేఖర్‌, హుస్సేన్‌, రామచంద్రరావు, ఖాన్‌, సాయికృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మే డే ఉత్సవాలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న కడెం లింగయ్య

తిరుమలగిరి : ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే ఉత్సవాలను జయప్రదం చేయాలని టీఎంపీఎస్‌ జిల్లా అధ్యక్షుడు కడెం లింగయ్య కోరారు. సోమవారం తిరుమలగిరి మార్కెట్‌లో హమాలీలు, కార్మికులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని ఆరోపించారు. కార్మికులంతా ఐక్యంగా ఉండి తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మికులందరికీ పీఎఫ్‌, ఈఎస్‌ఐ, ప్రమాద బీమా పథకాలను ప్రవేశపెట్టి అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి పానుగంటి శ్రీను, గంట సోమయ్య, మాణిక్యం, రవీందర్‌, ప్రతాప్‌, రాజు, సుమన్‌, రమేష్‌, నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ ఇవ్వడంలో జాప్యం చేస్తే చర్యలు

కోదాడరూరల్‌ : మిల్లర్లు ప్రభుత్వానికి సీఎంఆర్‌ ఇవ్వడంలో జాప్యం చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఆర్డీఓ సూర్యనారాయణ హెచ్చరించారు. సోమవారం కలెక్టర్‌ ఆదేశాల మేరకు కోదాడ పట్టణ పరిధిలోని వసుంధర, ధనలక్ష్మి, జయలక్ష్మి, కన్యాకాపరమేశ్వరి రైస్‌ మిల్లులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్‌ సీజన్‌లో ధాన్యం తీసుకున్న మిల్లుల యాజమాన్యాలు వారికి ఇచ్చిన గడువు లోగా ప్రభుత్వానికి సీఎంఆర్‌ అందివ్వాలని అన్నారు. డివిజన్‌ పరిధిలో ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకున్న అన్ని మిల్లుల్లో తనిఖీలు కొనసాగుతాయని ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో డీటీసీఎస్‌ రాంరెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కంటైనర్‌ను ఢీకొట్టిన కారు.. నలుగురికి గాయాలు

మోతె : ముందు వెళ్తున్న కంటైనర్‌ను కారు ఓవర్‌టేక్‌ చేయబోయి అదుపుతప్పి ఢీకొట్టిన ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మోతె మండల కేంద్రం శివారులో జాతీయ రహదారిపై సోమవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం పట్టణంలోని రామన్నపేట కాలనీకి చెందిన ఎండీ.అఫ్రోజ్‌, ఎస్‌కె.సిరాజ్‌, ఎస్‌కె.నుస్రత్‌, ఎస్‌కె. అత్తార్‌బీ ఉదయం పది గంటలకు కారులో హైదరాబాద్‌కు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు మోతె మండల కేంద్రం సమీపంలోకి రాగానే ముందుగా వెళ్తున్న కంటైనర్‌ను ఓవర్‌ టేక్‌ చేయబోయి అదుపుతప్పి ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురిలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే ఈ ప్రమాదానికి సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలియజేశారు.

క్లుప్తంగా

మెరుగైన భద్రత కోసం ఫ్లాగ్‌ మార్చ్‌



ఫ్లాగ్‌ మార్చ్‌ నిర్వహిస్తున్న పోలీసులు

తిరుమలగిరి : పార్లమెంట్‌ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రం, గ్రామాల్లో ఫ్లాగ్‌ మార్చ్‌ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నాగారం సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌ రఘువీర్‌రెడ్డి అన్నారు. సోమవారం తిరుమలగిరి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కె.సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలకు ఆకర్షితులై పార్టీలో చేరిక

దురాజ్‌పల్లి : జిల్లాలో మాస్‌ లైన్‌ పార్టీ చేస్తున్న ప్రజా ఉద్యమాలకు, ప్రజా పోరాటాలకు ఆకర్షితులై అనేకమంది సీపీఐ(ఎంఎల్‌) మాస్‌లైన్‌ పార్టీలో చేరుతున్నారని పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్‌ అన్నారు. సోమవారం మద్దిరాల మండలం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన పెరుమాళ్ల భాస్కర్‌ మాస్‌ లైన్‌ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి డివిజన్‌ కార్యదర్శి ఎర్ర అఖిల్‌ కుమార్‌, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పార్టీ జిల్లా నాయకులు పేర్ల నాగయ్య, గొడ్డలి నర్సయ్య పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న సోమనరసయ్య

భానుపురి : శ్రీరాముని దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని జిల్లా రైస్‌ మిల్లర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు ఇమ్మడి సోమ నరసయ్య తెలిపారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజార్‌లోని శ్రీ వేదాంత భజన మందిరంలో శ్రీసీతారామచంద్ర స్వామి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మందిర అధ్యక్ష, కార్యదర్శులు రాచర్ల వెంకటేశ్వరరావు, నకరికంటి రాజశేఖర్‌, కోశాధికారి సోమ అశోక్‌, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకుడు మొరిశెట్టి శ్రీనివాస్‌, జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు కక్కిరేణి చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.

సానయ్యకు పరామర్శ

నూతనకల్‌ : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు జటంగి సానయ్య అనారోగ్యంతో సూర్యాపేటలో చికిత్స పొందుతుండగా కాంగ్రెస్‌ నాయకులు సోమవారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో జిల్లా కాంగ్రెస్‌ నాయకులు కట్టా మల్లారెడ్డి, మహేశ్వరం చంద్రకళవెంకటయ్య, బొడ్డుపల్లి అంజయ్య, పన్నాల మల్లారెడ్డి, జటంగి గణేష్‌, బత్తిని వెంకటేష్‌, పూజల సైదులు పాల్గొన్నారు.

వీధి లైట్ల ఏర్పాటు



అర్వపల్లి దేవాలయం ఆవరణలో వీధి లైట్లు వేస్తున్న విద్యుత్‌, గ్రామ పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్‌

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం రోడ్డులో కొద్ది రోజులుగా వీధిలైట్లు వెలగక అంధకారంగా మారింది. అలాగే దేవాలయం ఆవరణలో కూడా లైట్లు పనిచేయక చీకటిమయమైంది ఈ విషయమై సాక్షిలో అంధకారంలో దేవాలయం రోడ్డు అనే శీర్షికన కథనం ప్రచురించగా అధికారులు స్పందించారు. గ్రామ ప్రత్యేక అధికారి సందీప్‌కుమార్‌, పంచాయతీ కార్యదర్శి శ్రావణి సోమవారం ఈ రెండు వీధులతోపాటు మరికొన్ని చోట్ల సీఎఫ్‌ఎల్‌ లైట్లు వేయించారు. కార్యక్రమంలో విద్యుత్‌ లైన్‌మెన్‌ రాజేష్‌, జేఎల్‌ఎం గంగరాజు, మరిపల్లి మల్లికార్జున్‌, గ్రామపంచాయతీ సిబ్బంది నర్సయ్య, లింగయ్య, శ్రీరాములు, యల్లయ్య, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

హరితహారం మొక్కలు దగ్ధం

మోతె : కొత్తగూడెంలో సోమవారం రైతు తాటికొండ వెంకట్‌రెడ్డి తన వ్యవసాయ భూమిలో చెత్త తగలబెడుతుండగా ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న హరితహారం మొక్కలకు మంటలు అంటుకొని దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న గ్రామ కార్యదర్శి కవిత వాటర్‌ ట్యాంకర్‌తో మంటలు ఆర్పించారు. రైతుకు రూ.రెండు వేలు జరిమానా విధించారు.